ప్రజాశక్తి

సోమవారం 28 జులై 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఊపందుకున్న సేద్యం

- ఖరీఫ్‌లో పెరగనున్న పత్తి సాగు - అవసరానికి మించి వర్షపాతం
- నేడు సాగర్ గేట్లు ఎత్తే అవకాశం - పులిచింతలకు పెరిగిన నీటి ప్రవాహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో ఖరీఫ్ సాగు ఊపందుకుంది. వర్షాల్లేక ఇప్పటి వరకు ఖరీఫ్ సాగు ఆలస్యం కాగా నాలుగు రోజులుగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధానంగా పత్తి, వరి, మిర్చి,కంది, శనగ, చిరుధాన్యాల సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిగా నిండటం వల్ల కాల్వలకు కూడా పూర్తి స్థాయిలో నీరు రావడం వల్ల వరి సాగుకు రైతులు నారుమళ్ళు పోసుకుంటున్నారు. నాగార్జున సాగర్‌లో గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా ఆదివారం రాత్రి 8 గంటలకు 583.5 అడుగుల వద్ద నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం సాగర్ జలాశయంకు ఎగువ నుంచి 93,115 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. తాజాగా పులిచింతలకు కూడా ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరిగింది. పులిచింతల గరిష్టనీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 25 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి పులిచింతలకు 40 వేల క్యూసెక్కులు వస్తుంది. దీంతో డెల్టాకు ఈ ఏడాది నీటి ఎద్దడి ▶ 2లో

నిండుకుండలా సాగర్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లు తెరిచేందుకు ప్రాజెక్ట్ అధికారులు రంగం సిద్ధం చేశారు. శ్రీశైలం నుంచి 120339 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా సాగర్ జలాశయానికి వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం గణనీయంగా పెరుగుతూ గరిష్టమటానికి ఏడు అడుగులు చేరువలో ఉంది. దీనితో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు వరద నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉన్నారు. ఏ సందర్భంలోనైనా సాగర్ గేట్లను తెరిచేందుకు సిద్ధంగా ఉన్నారు. సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను ఆదివారం సాయంత్రానికి 583 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతం 291.3795 టీఎంసీలకు చేరింది. కుడి, ఎడమ కాల్వలు, ఎస్‌ఎల్‌బిసి ఎఎంఆర్‌పి, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేందం ద్వారా మొత్తం 36033 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మాట్లాడుతున్న బాబూరావు

అప్పులతో కాదు.. కేంద్ర నిధులతో రాజధానిని నిర్మించాలి

- భూములను సింగపూర్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలు మానుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి- గుంటూరు

రాజధాని నిర్మాణం అప్పులతో కాకుండా, కేంద్రం నుండి నిధులు సాధించి నిర్మించాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు డిమాండ్ చేశారు. మరోదశ భూసమీకరణ చేయకుండా ప్రస్తుతం ఉన్న భూముల్లోనే రాజధానిని అభివృద్ధి చేయాలన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశంలో బాబురావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో కీలకమైన కూటమి నేతలు నారా లోకేష్, పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్ ఉన్నా జిల్లాలో అభివృద్ధి నామమాత్రమేనని అన్నారు. నేతలు, మాటలు ఎక్కువని, పని మాత్రం తక్కువగా ఉందని ఎద్దేవ చేశారు. ముఖ్యమంత్రి నివాసం, రాజధాని అమరావతి కూడా జిల్లా పరిధిలోనే ఉన్నా ఆస్థాయిలో అభివృద్ధి లేదన్నారు. అమరావతి నిర్మాణానికి భూములు తీసుకొని పదకొండేళ్ళు గడిచినా రైతు, కూలీలకు, ప్రజలకు చట్టబద్ధంగా ఇచ్చిన హామీలు నెరవేరలేదని, ఇప్పటివరకు కనీసం ప్లాట్లు కూడా చూపించకపోవడంతో రుణాలిచ్చే దిక్కులేదని విమర్శించారు. నాలుగు నెలల జాప్యం తర్వాత కూడా కొందరికే కౌలు జమచేశారని, ఉచిత విద్య, వైద్యం హామీ గాలికి వదిలేశారని అన్నారు. కొత్త పరిశ్రమలు, సంస్థలు లేవని, ఉపాధి లేదన్నారు. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న రాజధాని, జిల్లా ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. రాజధానికి తొలి దశలో తీసుకున్న 34 వేల ఎకరాల అభివద్ధికే దిక్కులేదని, మరో 44 వేల ఎకరాల భూ సమీకరణ ప్రకటనలతో ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. భూదాహమే తప్ప, రైతులు, ప్రజల గోడు పాలకులకు పట్టట్లేదని, లాభమే పరమావధిగా భావించే సింగపూర్ కంపెనీలకు రాజధానిలో భూములు అప్పజెప్పటానికి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. సింగపూర్ చుట్టూ తిరగటం ▶ 2లో

మాచర్ల ఆకాశవాణి కేంద్రం

స్థానిక మాటలేని ఆకాశవాణి!

- ఇతర కేంద్రాల ప్రసారాలకే పరిమితం
- నిరుపయోగంగా పరికరాలు, భవనాలు

ప్రజాశక్తి - మాచర్ల

ఆకాశవాణి (ఆలిండియా రేడియో) కేంద్రం పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని శ్రీశైలం ప్రధాన రహదారి పక్కన వుంది. ఈ కేంద్రం ద్వారా 103.1 ఫ్రీక్వెన్సీలో అకాశవాణి ప్రసారం అవుతాయి. ఈ రేడియో స్టేషన్ పూర్తిస్థాయిలో పనిచేయటం లేదు. కేవలం ఇతర రేడియో కేంద్రాల ప్రసారాలను అంతరాయం లేకుండా ప్రసారం చేయటానికే పరిమితమైంది. 18 ఏళ్ల కిందట పట్టణలోని శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భూమిలో 10 ఎకరాలు రేడియో స్టేషన్‌కు ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో ఉన్న ఏకైక రేడియో స్టేషన్ ఇదే. 2007లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ అకాశవాణి కేంద్రంలో స్థానికంగా రూపొందించిన కార్యక్రమాలు ప్రసారం అవుతాయని అందరూ భావించినా ఇతర స్టేషన్ల ప్రసారాలతోనే సరిపెట్టారు. ముగ్గురు నలుగురు ఉద్యోగులే విధులు నిర్వహిస్తుండగా కార్యక్రమాలు రూపొందించటానికి ఉద్దేశించిన పరికరాలు కూడా వినియోగించకుండానే మూలనపడ్డాయి. స్టేషన్ నిర్వహణ, ఉద్యోగులు, సిబ్బంది కోసం నిర్మించిన భవనాలు నిరూపయోగంగా మారాయి.

రేడియో స్టేషన్ ద్వారా వెలువడే ప్రసారాలు ప్రజలకు అనేక రకాల సమాచారం, ▶ 2లో

పాత ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్మించిన చేనేత భవన్

చేనేత భవనం.. చేజేతులా నిరుపయోగం..

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత వస్త్ర వ్యాపారులు విక్రయాలు చేసేందుకు పట్టణ పరిధిలోని పాత ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో గత ప్రభుత్వం రూ.ఐదు కోట్లతో చేనేత భవనాన్ని నిర్మించింది. ఈ స్థలం 1990 వరకు ఆర్టీసీ బస్టాండ్‌గా ఉండేది. కొత్త బస్టాండ్ ఏర్పాటు తర్వాత కొన్నేళ్లు సిటీ బస్సు స్టాండ్‌గా ఉండేది. మరికొన్నేళ్లు నిరుపయోగంగా ఉంది. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన టిడిపి ఈ స్థలంలో అన్న క్యాంటీన్‌ను నిర్మించగా 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక మూసేసింది. చేనేత వస్త్ర వ్యాపారులకు అక్కడ వ్యాపారం చేసుకునేందుకు వీలుగా ఐదు అంతస్తులతో కాంప్లెక్స్‌ను నిర్మించి గతేడాది జనవరిలో ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రారంభించారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చేనేత వనం నిరుపయోగంగా మారడం జరిగిపోయాయి.

తెనాలి రోడ్డు వెడల్పు చేసిన తర్వాత ఇక్కడ షాపులను చేనేత వస్త్ర వ్యాపారులకు ఇవ్వాలని గత ప్రభుత్వం భావించింది. ప్రస్తుత ప్రభుత్వమూ ఇటీవల తెనాలి రోడ్డును విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. అయితే ఈ మార్గంలో శ్మశానం ఉన్న కారణంగా రోడ్డు విస్తరణ పూర్తవుతుందా? లేదా? అనే సందేహాలు నెలకొన్నాయి. విస్తరణ పూర్తి చేసినా ఈ భవనాన్ని చేనేత వస్త్ర వ్యాపారులకు కేటాయిస్తారా? లేదా? అనేదీ ప్రశ్నార్థకంగానే ఉంది. రూ.కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాన్ని చేజేతులా నిరర్థకం చేయడం తగదని, సత్వరం వినియోగంలోకి తేవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వైద్యులు నిరుపేదలను ఆదుకోవాలి

10 కుటుంబాల దత్తతకు డాక్టర్ షేక్ అంగీకారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : పి-4 అమలులో భాగంగా నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు వైద్యులు ముందుకు రావాలని ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ కోరారు. స్థానిక ఐఎంఎ హాలులో జరిగిన వైద్యులతో ఎమ్మెల్యే ముఖాముఖిగా మాట్లాడారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు కొన్ని కుటుంబాలను దత్తత తీసుకొని వారిని దారిద్య్రం నుంచి పైకి తీసుకునిరావాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతిఒక్క డాక్టర్ మార్గదర్శులుగా ఉండి కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు. ఇందుకు ప్రముఖ వైద్యులు డాక్టర్ వై.షేక్ స్పందిస్తూ 10 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. ఆయన్ను ఎమ్మెల్యేతోపాటు డిఎంహెచ్ఎం విజయలక్ష్మి, ఐఎంఎ సెక్రటరీ డాక్టర్ సాయికృష్ణ, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రాధికరాణి సన్మానించారు.

అమరావతి మహిళల పాదయాత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : డాక్టర్ పట్టాభి కళాపీఠం, విశాఖ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో, అడపా రామకృష్ణ రచించిన అమరావతి మహిళల మహా పాదయాత్ర దీర్ఘ కవిత పుస్తకాన్ని స్థానిక బ్రాడీపేట ఎస్.హెచ్.ఓలో ఆదివారం అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆవిష్కరించారు. సభకు పట్టాభి కళాపీఠం అధ్యక్షులు తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. విశాఖ సంస్కృతి మాసపత్రిక సంపాదకులు శిరేల సన్యాసిరావు, పుస్తక రచయిత అడపా రామకృష్ణ, ఉద్యమకారిణి వంకాయలపాటి శివకుమారి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, రావి రంగారావు, అమరావతి ఉద్యమనేత మల్లికార్జునరావు మాట్లాడారు. పుస్తక రచయిత అడపా రామకృష్ణ మాట్లాడుతూ తాను విశాఖ వాసినైనా ఆంధ్రుల పోరాటాన్ని చూసి ఆవేదన చెంది, పోరాట ఘట్టాలను గ్రంథస్తం చేయాలనే సంకల్పంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు చెప్పారు. బి.జమదగ్ని జానీబాషా, సుభాని, టి.పద్మావతి, లలితకుమారి, ఎవికె సుజాత, సుభద్రా కృష్ణ, సత్యవతి, రమణి, భానోజీబాబు, రాధాకృష్ణమూర్తి, వెంకాయమ్మ, పి.శివరావు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు: కిడ్నీ సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ వి.వెంకటనాయుడు అన్నారు. అవగాహన ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ వెంకటనాయుడు మాట్లాడుతూ పెద్ద వయసు వారిలో ప్రోస్టేట్‌కు సంబంధించిన సమస్యలు ఎక్కువగా కనబడుతున్నాయని, మూత్రం సరిగ్గా రాకపోవడం, మూత్రం త్వరగా పడిపోవడం లాంటి లక్షణాలు కనబడతాయని అన్నారు. ఈ లక్షణాలు కనబడితే వెంటనే యూరాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచించారు. శరీరానికి సరిపడా నీటిని తీసుకోకపోయినా, అనారోగ్య ఆహార అలవాట్ల వల్ల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే అవకాశం ఉందన్నారు. డీ హైడ్రేట్ కాకుండా మూత్రం తెల్లగా వచ్చే వరకు మంచినీటిని తీసుకోవాలన్నారు. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడినప్పుడు వాటి సైజును బట్టి, అవి ఏర్పడ్డ ప్రదేశాన్ని బట్టి కొన్ని సందర్భాలలో అధిక మొత్తంలో నీటిని తీసుకోవడం ద్వారా పడిపోయేటట్లు చేయడం, లేదా శస్త్ర చికిత్స ద్వారా తీసివేయవచ్చన్నారు. కిడ్నీకి క్యాన్సర్ సోకిన సందర్భాలలో మూత్రంలో రక్తం గడ్డలు గడ్డలుగా రావడం కడుపులో నొప్పి లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. కిడ్నీలకు, బ్లాడర్‌కు, బీర్జాలకు, అంగానికి వస్తుంటాయని, ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు మూత్రవిసర్జన సమయంలో మంట, చురుకు రావడం, మూత్ర విసర్జనకు వెళ్లే లోపల పడిపోవడం, చలి, జ్వరం లక్షణాలు కనబడతాయన్నారు. యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ ఎక్కువగా ఆడవారిలో కనబడుతుందని ఈ సమస్యకు మందుల ద్వారా మంచి చికిత్స అందుబాటులో ఉందన్నారు. షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకోకుంటే కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, రాడికల్ హ్యూమనిస్ట్ కె.చంద్రశేఖర రావు, గాయత్రి బ్యాంక్ మేనేజర్ సుబ్బారావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన నారా లోకేష్.. గతంలో అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని కూటమి సర్కారు ఎందుకు రద్దు చేయట్లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు ప్రశ్నించారు. నగరంలోని పాతగుంటూరు బాలాజీ నగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో అదానీ స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆదివారం సిపిఎం శ్రేణుల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా వ్యతిరేకించిన టిడిపి నేడు స్మార్ట్ మీటర్లు వేగంగా ఏర్పాటు చేస్తూ ప్రజలపై భారాలు మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. ఇప్పటికే ట్రూఅప్, సర్దుబాటు చార్జీలతో విసిగిపోయిన ప్రజలు అదానీ ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారని వెల్లడించారు. వామపక్షాల ఆధ్వర్యంలో ఆగస్టు 7న విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రజాసంఘాలు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, అపార్ట్మెంట్ కమిటీలు ఆధ్వర్యంలో అధికారులకు సామూహిక రాయబారాలు, విద్యుత్ భారాల వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి నళినీకాంత్, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు లక్కా అరుణ, సిపిఎం పాత గుంటూరు శాఖ కార్యదర్శి కార్తీక్, సభ్యులు ముత్యాలరావు, కె.గంగాధరరావు, కె శ్రీనివాస్, సుధీర్, నాంచారయ్య, ఎం ఎ చిస్టీ, కళ్యాణి, ఆది నికల్సన్, సలీం, ఫణి, ఖాసీం షాహిద్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులపై ప్రజలతో మాట్లాడుతున్న బాబూరావు, ఇతర సిపిఎం నాయకులు

కేంద్ర నిధులతో రాజధానిని నిర్మించాలి

(మొదటి పేజీ తరువాయి)

మానుకొని, నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. మోడీ రాజధానికి రెండుసార్లు వచ్చినా, చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి, ఉపన్యాసాలు తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. బడా కంపెనీలకు భూములు కట్టబెట్టడం తప్ప, పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లకు ఒక్క సెంటు స్థలం ఇవ్వలేదన్నారు. ఆగిపోయిన ఇళ్లు పూర్తి చేయలేదని, పూర్తయిన ఇళ్ళు కేటాయించలేదని, సౌకర్యాలు కల్పించలేదన్నారు.వక్ఫ్ భూములు సైతం బడా సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలు చేయడం దుర్మార్గంమని, కేంద్రంలో కీలక బాధ్యతలలో ఉండి కూడా గుంటూరు శంకర్ విలాస్ ఫ్లైఓవర్‌కు అవసరమైన నిధులు తేకుండా, సైజు తగ్గించి బ్రిడ్జి నిరించాలని ప్రయత్నించటం గర్హనీయమని అన్నారు. అవినీతికి అంతులేకుండా పోయిందని, ప్రజా ప్రతినిధులు ఇసుక, మైనింగ్, మద్యం, బెల్ట్ షాపులు, భూ వివాదాల్లో, అవినీతిలో కూరుకుపోయి, ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని, అభివృద్ధిని విస్మరించారన్నారు. కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, భారాలు పెంచడమే తప్ప, సంక్షేమ పథకాల అమలు నామమాత్రంగా మిగిలిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ మిర్చి, బర్లి పొగాకు, పత్తి తదితర ఏ పంటకూ మద్దతు ధర లేదని, గుంటూరు ఛానల్‌కు నిధులు లేవని అన్నారు. విద్యుత్ బిల్లులు కట్టలేక, ప్రభుత్వ సహాయం అందక స్పిన్నింగ్ మిల్లులు మూతపడ్డాయని, ఉపాధి దెబ్బతిని, కొత్త పరిశ్రమలు రావట్లేదని చెప్పారు. ప్రైవేటు యూనివర్సిటీలపై మోజు తప్ప, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అభివృద్ధిపై దష్టి లేదని, కనీసం ప్రజా ప్రతినిధులు తొంగి కూడా చూడట్లేదని విమర్శించారు. గుంటూరులో మేయర్ పదవి దక్కించుకోవడంపై ఉన్న శ్రద్ధ తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు మౌలిక సదుపాయాల కల్పనపై లేదని, ఎమ్‌టిఎంసి (మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్)లో పన్నుల పెంపు తప్ప, సదుపాయాలపై శ్రద్ధ లేదని అన్నారు. తాడేపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నెలలు తరబడి ఆందోళన చేస్తున్నా పాలకులలో చలనం లేదని, దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్‌లో ప్రమాదం జరిగి రెండేళ్లు గడిచినా అందరికీ ఇంకా సహాయం అందలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వ బాటలోనే టిడిపి నడుస్తోంది, ప్రజా ప్రతినిధులు అవినీతిలో పోటీపడుతోందని, ప్రజలాను గాలికొదిలేశారని అన్నారు. ఈ స్థితిలో విద్యుత్ భారాలు, ఆదానీ స్మార్ట్ మీటర్లు, ఇళ్ళు, పట్టాలు, హామీల అమలు కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని, పాలకులను నిలదీయాలని, ప్రజలను కూడగట్టాలని సిపిఎం శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, ఎం.రవి, కె.నళినీకాంత్, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్థానిక మాటలేని ఆకాశవాణి!

(మొదటి పేజీ తరువాయి)

వినోదం అందించటంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో హెచ్చరించి సహాయం అందిస్తాయి. రాష్ట్రంలోవున్న వివిధ రేడియో స్టేషన్ల ద్వారా స్థానిక కళాకారులు, విద్యార్థులు, మేథావులతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు, పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పాటలు, కథలు, విద్యాపరమైన కార్యక్రమాలు, ఇతర వినోదభరితమైన కార్యక్రమాలు ద్వారా పిల్లల మానసిక వికాసానికి, వినోదానికి రేడియోకేంద్రం దోహద పడుతుంది. కథలు, నాటకాలు వంటి రేడియో కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయటానికి ఉపయోగపడటంతో పాటు ఇతరులతో ఎలా సంభాషించాలో నేర్చుకుంటారు. భాషా నైపుణ్యాలు మెరుగుపడతాయి. విజ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని పెంపొందించుకోవటానికి ఈ రేడియో కేంద్రాన్ని ఉపయోగించుకోవచ్చు. కళాకారులు, కవులు, రచయితల ద్వారా పలు కార్యక్రమాలు రూపొందించవచ్చు. అయినా ఇవేమీ ఇక్కడ జరగటం లేదు. కనీసం స్థానికులను లోపలకి కూడా అనుమతించరు. కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రంలోని పాలక పార్టీ భాగస్వామి కనుక నాయకులు ప్రయత్నిస్తే మాచర్ల రేడియో స్టేషన్‌ల్లో కార్యక్రమాలు రూపొందించుకునే అవకాశం లభిస్తుందని స్థానికులు అంటున్నారు.

గతమెంతో ఘనకీర్తి కలిగిన రేడియో ప్రసారాలు రోజురోజుకీ తీసికట్టుగా మారాయి. సరైన కార్యక్రమాలు రూపొందించలేక రాష్ట్రంలోని ముఖ్యమైన విజయవాడ, నెల్లూరు, కడప, విశాఖ, తిరుపతి ఆకాశవాణి కేంద్రాలు కూడా అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులు రిటైర్డు అవుతున్నా కొత్తవారిని నియమించడం లేదు. ఆర్థిక కోణంలో వీటిపై ప్రభుత్వాలూ నిర్లక్ష్యం చూపుతున్నాయి. క్రికెట్ వంటి క్రీడల ప్రసారాలు కూడా ప్రైవేటు వారికి అప్పగిస్తున్నారు. ఇలానే కొనసాగితే భవిష్యత్తులో రేడియో కేంద్రాలు పూర్తిగా మూతపడే అవకాశమూ లేకపోలేదు. ఇదిలా వుండగా నిరూపయోగంగా మారిన మాచర్ల రేడియో కేంద్రం భవనాల్లో స్థానిక ప్రభుత్వ హాస్టళ్ల పెట్టుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఊపందుకున్న సేద్యం

(మొదటి పేజీ తరువాయి)

ఉండదని భావిస్తున్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉంది. కృష్ణా, ఖమ్మం జిల్లాల క్యాచ్‌మెంట్‌తోపాటు పులిచింతల దిగువ కురిసిన వర్షాలతో ప్రకాశం బ్యారేజికి వరద వస్తోంది. ఎగువ నుంచి 15,670 వస్తుండగా అదే స్థాయిలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం అటు సాగర్ ఆయకట్టులో, ఇటు డెల్టాలో నీటి ఎద్దడి తొలగిపోవడం వల్ల పంటల సాగుకు అవకాశాలు మెరుగుపడ్డాయి.

గుంటూరు జిల్లాలో జిల్లా మొత్తం మీద ఈఏడాది ఖరీఫ్‌లో 2.25 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేస్తారని అంచనా వేయగా ఆదివారం వరకు 52 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను వేశారు. ప్రస్తుతం తాడికొండ, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు, పెదకాకాని మండలల్లో పత్తి సాగు చురుగ్గా సాగుతోంది. అలాగే తెనాలి, పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాల పరిధిలోని డెల్టా ప్రాంతంలో వరి సాగుకు వెదపద్ధతిలో ఎక్కువ మంది సాగు చేస్తున్నారు. మరికొంత మంది రైతులు తెనాలి, పొన్నూరు,కొల్లిపర, కాకుమాను, పెదనందిపాడు, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో నాట్లు వేసేందుకు నారుమళ్లు పోస్తున్నారు.

పల్నాడు జిల్లాలో 4.5 లక్షల విస్తీర్ణంలో సాగు చేయాల్సి ఉండగా 60 వేల ఎకారల్లోనే వివిధ రకాల పంటలను సాగు చేశారు. ప్రధానంగా ఈ ఏడాది మిర్చిసాగుకు విముఖత వ్యక్తం చేస్తున్న రైతులు పత్తి, కంది, మొక్కజొన్న, శనగ పంటల సాగు వైపు దృష్టి సారించారు. సాగర్ కాల్వలకు నీటి విడుదల పూర్తిస్థాయిలో రాగానే వరి నాట్లు వేసేందుకు వీలుగా కొద్ది మంది రైతులు నారుమళ్లు పోస్తున్నారు. ఈ ఏడాది ఎదురయిన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నల్లబర్లీ పొగాకు, మిర్చి సాగుపై రైతులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. చిలకలూరిపేట, వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు దాదాపు 40 వేల ఎకరాల్లో ప్రత్తి సాగు చేశారు. మరో 20 వేల ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేసినట్టు అధికారులు తెలిపారు.

గుంటూరు జిల్లాలో జులైలో 164.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఆదివారం వరకు 228.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లాలో 109.8 మిల్లీ మీటర్లకు గాను 144.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుతానికి అవసరానికి మించి వర్షం కురిసిందని కాల్వల్లో పుష్కలంగా నీరు ఉందని, రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావొచ్చని అధికారులు చెబుతున్నారు.

అలరించిన రఫీ సంగీత విభావరి

ప్రజాశక్తి - తెనాలి : సంకీర్తన సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నేపథ్య గాయకులు మహమ్మద్ రఫీ వర్థంతి సందర్భంగా స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం సంగీత విభావరి నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పురుషోత్తమరావుతోపాటు హైదరాబాద్, పొన్నూరు నుండి వచ్చిన గాయకులు షావనాజ్, అలీఖాన్, పట్టణానికి చెందిన షేక్ సైదా మహమ్మద్.. రఫీ పాటలను ఆలపించారు. యుగళ గీతాల్లో విజయవాడకు చెందిన శివలీల, పట్టణానికి చెందిన మల్లిక జత కట్టారు.

మద్యం జోరు - మత్తులో యువత బేజారు

- తాడేపల్లిలో విచ్చలవిడిగా బెల్టు షాపులు
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

బెల్టుషాపులో విక్రయిస్తున్న మద్యం

ప్రజాశక్తి- తాడేపల్లి

తాము అధికారంలోకి వస్తే బెల్టు తీసేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఎంటియంసి పరిధిలోని తాడేపల్లి పట్టణంలో నెరవేరలేదు. దేశానికి ఉపయోగపడాల్సిన యువ తరం మత్తులో జోగుతుంది. కొన్ని సందర్భాల్లో కనిపించిన తల్లిదండ్రులకు విషాదాన్ని మిగులుస్తున్నారు. తాడేపల్లి పట్టణంలో సుమారు 200 బెల్ట్ షాపులు ద్వారా రోజు రూ.2లక్షల మేర అమ్మకాలు జరుగుతున్నాయి. ఇల్లు సైతం బెల్ట్ షాపుగా మారి కుటీర పరిశ్రమగా విరాజిల్లుతోందంటే అతిశయోక్తి కాదు. గత ప్రభుత్వం అయినా, ప్రస్తుత ప్రభుత్వ మైన అనుసరించే విధానాలు ఒకటే అని చెప్పటానికి మద్యం అమ్మకాలు ఉదాహరణగా చెప్పవచ్చు. ఒక పక్కన అధికార యంత్రాంగం ఎక్కడా బెల్ట్ షాపులు లేవనీ, నిబంధనలకు అనుగుణంగా వైన్‌షాపులు నడపబడుతున్నాయని తెలుపు తున్నారు. కానీ తాడేపల్లి పట్టణం, రూరల్ గ్రామాలు, రాజ ధానిలో భాగమైన ఉండవల్లి, పెనుమాకలో బెల్ట్‌షాపులు పెద్ద ఎత్తున నడుస్తున్నాయి. నిబంధనలకు అనుగుణంగా కూడా వైన్ షాపులు నడపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉండవల్లి సెంటర్‌లోనే పక్కపక్కనే రెండు వైన్‌షాపులు వద్ద తాగటం, తినడంతో పాటు సిట్టింగ్ సదుపాయం కూడా దారి పక్కన ఏర్పాటు చేసుకుంటున్నారు. గృహిణులు, మహిళలు మందు బాబుల ఆగడాలు భరించలేక తమ ఇళ్ళ ముందు కర్రలతో ఫెన్సింగ్ వేసుకుంటున్నారు. స్థానికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసి పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో పాటు రాజకీయ పార్టీల నాయకులకు కూడా వైన్‌షాపులు ఎత్తేయమని అర్జీలు అందజేశారు. అయినా ఫలితం కనిపించలేదు. అధికార పార్టీ అండదండలతో ఏమి చేసినా తమకు ఎదురు లేదనే భావనతో షాపుల నిర్వాకులు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. షాపుల నిర్వాహకులు ఎవరనేది కూడా అర్థం కాని పరిస్థితి నెలకొని ఉంది. తెల్లవారుజాము నుండి ప్రారంభమైన బెల్ట్ షాపులు రాత్రి వరకు కొనసాగుతున్నాయనీ, అటువైపు కన్నెత్తి చూసే అధికారులే కరువయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఇళ్లల్లో నడిచే బెల్ట్‌షాపులు 24 గంటలు పని చేస్తున్నాయి. స్థానికంగా ఎక్కడికక్కడ మద్యం అందుబాటులోకి రావడంతో మందుబాబులు అధికమయ్యారని ఇటు పెద్దలు, అటు స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు బెల్ట్‌షాపులపై చర్య తీసుకోవాలని వైన్ షాపుల నిర్వహణ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన పలువురు కోరుతున్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

రూ.14,590 స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంలోని శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను మంగళగిరి రూరల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14,590లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ మాట్లాడుతూ... పేకాటలో పట్టుబడిన నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. మంగళగిరి రూరల్ స్టేషన్ పరిధిలో పేకాట, కోడి పందాలు, ఇతర జూదాలతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులతో చైర్పర్సన్, కమిషనర్

ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్ బెర్రీ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ప్రకృతి పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు 2కె వాక్ నిర్వహించారు. స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రం నుంచి ఏర్పాటు చేసిన 2కె వాక్ ను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ వి.లక్ష్మీపతిరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు కీలకంగా వ్యవహరించాలని, మొక్కల పెంపకం పై అవగాహన కలిగి ఉండాలి అని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని వివరించారు. ర్యాలీలో విద్యార్థులు ప్రకృతి పరిరక్షణకు సంబంధించి ప్లకార్డులు, వివిధ రకాల చిత్రాలను ప్రదర్శించారు. ర్యాలీ శివాజీ చౌక్, గాంధీ చౌక్ మీదుగా ఉషోదయ మార్ట్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గన్నారు.

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 4881 of 2023
Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) & Authorized Officer, ...Plaintiff
And
Sri.N.Naga Raja, ...Defendant
To
Sri.N.Naga Raja, S/o.Krishna Murthi, Aged Major, Occ: Not Known,R/o. Door.No.8-86/1, Rentachintala, Guntur, Andhra Pradesh-522421.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,19,215-13ps to_wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 10-09-2025.
In case of your failure to attend before the Court on 10-09-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD-50.**

పద్మశాలి భవన్ నిర్మాణానికి సహకరించండి

శాసనమండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు

ప్రజాశక్తి - మంగళగిరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో రాష్ట్రంలో పేద చేనేత కుటుంబాలకు చెందిన విద్యార్థు లను ఆదుకునేందుకు అసోసియేషన్ గత 15 ఏళ్లలో రూ. 3కోట్ల సహాయం అందజేయటం గొప్ప విషయం అని శాసన మండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు అన్నారు. ఆదివారం సాయంత్రం మంగళగిరి నాంచారమ్మ ప్రాంగణంలోని భద్రావతి సమేత భావన రుషి కళ్యాణ మండపంలో మంగళగిరి పివా బ్రాంచి అధ్యక్షులు తాటిపాముల లక్ష్మీ పెరు మాళ్లు అధ్యక్షతన విస్తృత సమావేశం జరిగింది. సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్లో పద్మశాలి భవన్ నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు స్వర్గం పుల్లారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పద్మశాలి ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారికి ఎంతో కొంత సహకారం అందించాలన్న లక్ష్యంతో పివా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్తగా ఏర్పడే పద్మశాలి భవన్ ఎక్కువ సేవలు అందించేందుకు ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి వెన్నకోట వెంకటేశ్వర్లు, బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుం జయరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, కేంద్ర కమిటీ కోశాధికారి నీలి కనకదుర్గ ప్రసాద్, సహాయ కార్యదర్శి మురు గుడు లక్ష్మీనారాయణ, బ్రాంచి ఉపాధ్యక్షులు గంజి రవీంద్రనాథ్, కోశాధికారి బట్టు నారాయణ రావు, కేంద్ర కమిటీ సభ్యులు అందే వెంకన్న, గోలిమోహన్రావు, కారంపూడి అంకమ్మరావు, ముట్టే రామచంద్రరావు, అవ్వరు బుల్లబ్బాయి, గుర్రం చిన్న వీరయ్య, జన్నాదుల భిక్షారావు, ఎ. రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- తాడేపల్లి

విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

చదువులు మంచి ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు ఆర్థిక పరిస్థితి ఆటంకం కారాదని, వారికి చేయూతను అందించేందుకు నేనున్నా నంటూ తాడేపల్లికి చెందిన రామ్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకొచ్చింది. గతంలో కూడా అనేక మందికి ఆర్థిక సాయం అందించిన రామ్‌చారిటబుల్ ట్రస్ట్‌కు పలువురు తమ అభినందనలు తెలిపారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ, ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న ఇద్దరు విద్యార్థులకు రామ్‌చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందిం చింది.వారి ఇబ్బందులను ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ పలగాని శ్రీనివాస్, దాత రాజులపాటి పోతురాజు దృష్టికి స్థానికులు తీసు కెళ్లారు. వడ్లమూడి గ్రామానికి చెందిన విద్యార్థిని యేమినేని భానుశ్రీ (ఇంటర్ రెండు సంవత్సరం), యేమినేని విగ్నేష్(ఇంటర్ మొదటి సంవత్సరం)లకు రూ.10 వేలు వంతున, రూ.20 వేలను, రాష్ట్ర గ్రామ, వార్డు సచివాల యాల డైరెక్టర్, ఎపి హౌసింగ్ ఎండి ఎం.శివప్రసాద్ చేతుల మీదుగా ఆదివారం చెక్కులు రూపంలో అందజేశారు. ఇరువురు విద్యార్థినులు చదువులో ఇంకా రాణించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని శివప్రసాద్ ఆకాంక్షించారు. కార్యక్రమం లో రామ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు, రాజులపాటి పోతురాజు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

సీఐ శివరామకృష్ణ

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సీఐ శివరామకృష్ణ హెచ్చరించారు ప్రతి ఆదివారం రౌడీ షీటర్లకు పోలీస్ స్టేషన్లో నిర్వహించే కౌన్సిలింగ్ లో భాగంగా ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు ప్రతి కౌన్సిలింగ్‌కి ప్రతి ఆదివారం హాజరు కావాలని అనవసరమైన గొడవల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు మండలంలో రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు నిగా నిత్యం ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న సిఐ శివరామకృష్ణ

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

కంప్యూటర్ సాఫ్ట్వేర్ వివిధ సాంకేతిక విధానాల వల్ల సమాజంలో సైబర్ నేరాలు నానాటికి పెరిగిపోతున్నాయని ఫిరంగిపురం సిఐ శివరామకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన ఫిరంగిపురంలో ఏసియన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఎక్సైజ్ సీఐ బాలయ్య ప్రోత్సాహంతో ఫౌండేషన్ ఫర్ ఎంఎస్ఈ వారు సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ వర్క్ షాప్ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామకృష్ణ మాట్లాడుతూ బ్యాంకుల్లో వివిధ ఆర్థిక డిజిటల్ అరెస్టులు ఇటీవల తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని గుర్తు చేశారు. చదువుకున్నవారే సైబర్ నేరస్తుల ఉచ్చులో చిక్కుకొని మోసపోతున్నారన్నారు. సైబర్ నేరాలను అరికట్టడం కేవలం పోలీస్‌డ్యూటీ మాత్రమే కాదని అందరూ కలిసి కట్టుగా పని చేస్తేనే సైబర్ నేరగాలను ఎదుర్కొనడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత ఆర్థిక భద్రత పరమైన నేరాలను సైబర్ నేరాలంటారన్నారు. ఇంటర్నెట్ మాధ్యమం ద్వారా ప్రైవసీని భగ్నం చేయవచ్చన్నారు. గుంటూరు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి మహేష్ ఎఫ్ఎంసి సౌత్‌జోన్ హెడ్ ఏఎస్‌కె శర్మ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీనుబాబు జిల్లా ట్రైనర్ కే.రమేష్‌బాబు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిపోయిన రాధిక

వర్షాకాలం పారిశుధ్యం మెరుగ్గా ఉండాలి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో పారిశుధ్యం వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని మరింత మెరుగ్గా ఉండేలా జాగ్రత్తగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. పట్టణంలోని ఏడవ వార్డులో ఆదివారం నిర్వహించిన పారిశుధ్య పనులను చైర్పర్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ పారిశుధ్యాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంహెచ్ఓ ఎం ఏసు బాబు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డ్ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ కమిటీ సభ్యులు

సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల కో-ఆపరేటివ్ సొసైటీ కమిటీ చైర్మన్‌గా కన్యధార రాజు, వైస్ చైర్మన్‌గా షేక్. మహబూబ్ బాషా, సభ్యునిగా శుద్ధపల్లి నవీన్‌లు ఆదివారం ప్రకాష్ నగర్‌లోని జిడిసిసి బ్యాంక్ ప్రాంగణంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రైతులకు కో-ఆపరేటివ్ సొసైటీలు పట్టు కొమ్మలన్నారు. రైతుల ఆర్థిక స్థితిగతులను ఉన్నతం చేయ డంలో ఈ సొసైటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. రైతులకు అవసరమైన ఆర్థిక సహాయం, వ్యవసాయ సామగ్రి, సమా చారాన్ని సొసైటీల ద్వారా అందించవచ్చన్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు రైతుల సంక్షేమం కోసం అవిరామంగా కషి చేయాలని సూచించారు. నరసరావుపేట వ్యవసాయ మార్కెట్‌యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, నాయకులు కడియాల రమేష్, కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డిరవి, పి. రామిరెడ్డి, సొసైటీ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా అందక రైతులు అవస్థలు

ప్రజాశక్తి - రెంటచింతల

వాయుగుండం ప్రభావంతో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రైతు సేవ కేంద్రాల్లో, ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా, ఎరువులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఏ డీలర్, ఏ ఎరువుల లారీ వస్తుందో తెలుసుకొని అక్కడికి పరుగులు తీస్తున్నారు. మరోవైపు ప్రైవేటు వ్యాపారులు ఎంఆర్‌పి రూ.280 ఉన్న బస్తా యూరియాను రూ.50 అదనంగా అమ్ముతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా కొంత వరకు యూరియా మార్కెట్ యార్డుకు వచ్చినా రైతుసేవా కేంద్రాలకు ఇంకా చేరలేదు. మండలంలోని 13 రైతుసేవా కేంద్రాల్లోనూ యూరియాను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

వేతనాలు పెంచి బదిలీలు చేపట్టండి

ఎన్టీఆర్ వైద్య సేవ రాష్ట్ర అధ్యక్షులు బుజ్జి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా విభాగంలో పని చేస్తున్న వైద్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి ఒక ప్రకటనలో కోరారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ వైద్యమిత్రాల బదిలీలు చేపడతామని రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 2 వేల మంది వైద్య మిత్రాల డేటాను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ సీఈఓ ఆదేశాల మేరకు టీం లీడర్లు ఆయా జిల్లాల కోఆర్డినేటర్ల నుండి తీసుకున్నారని పేర్కొన్నారు. వైద్య మిత్రలు పని చేస్తున్న ఆసుపత్రి నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఆసుపత్రికి బదిలీ చేపడతామని ప్రకటించి ప్రక్రియ చేపట్ట లేదని తెలిపారు. గతంలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌లలో పని చేస్తున్న వైద్య మిత్రలను గత ప్రభుత్వం 2022లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌కు నెట్వర్క్ హాస్పిటల్‌కి మార్చడంతో 40 నుండి 60 కిలోమీటర్ల పరిధిలో పని చేయడం ఆర్థిక భారంగా ఉందన్నారు. అరకొర వేతనాలతో రవాణా ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కూటమి మేనిఫెస్టో మేరకు రూ.25 వేల లోపు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

పాలకుల నిర్లక్ష్యం... అధికారుల ఉదాసీనత

సకాలంలో రాని ఆర్టీసీ బస్సులు
ఇబ్బందుల్లో ప్రయాణీకులు
ప్రయివేటు వాహనాలు, ఆటోరిక్షాలే గత్యంతరం

ఆక్రమణకు గురైన రొంపిచర్ల బస్‌స్టేషన్

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలో రవాణా వ్యవస్థకు అన్ని వసతులు ఉన్నప్పటికీ సరైన బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీనత కారణంగా ప్రయాణీకులు ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని రొంపిచర్ల మండలం రాజకీయ, వ్యవసాయ, సామాజిక పరంగా పేరొందినప్పటికీ మేడిపండు చందంగా తయారైంది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు నిత్యం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు కొన్ని దశాబ్దాలుగా అనేక పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. అయితే రొంపిచర్ల మండలం నైసర్గిక స్వరూపం ప్రకారం అంతర్గత గ్రామాల నుండి మండల ప్రధాన కేంద్రం చేరాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో వాహన వినియోగం తప్పనిసరి. కాగా సుమారు 80 వేలమంది జనాభా కలిగి 25 రెవిన్యూ గ్రామాలు, పన్నెండు శివారు గ్రామాలున్న రొంపిచర్ల మండలానికి తగినన్ని బస్సు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఆర్టీసీ డివిజన్ కేంద్రమైన నరసరావుపేట నుండి అద్దంకి నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారిలో రొంపిచర్ల మండలం ఉన్నప్ప టికీ మండల కేంద్రానికి రోజూ కేవలం మూడు సర్వీసులు నడుస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అనుకున్న సమయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రజలు ప్రయివేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసి ప్రయాణం సురక్షితం అనే నినాదానికి తూట్లుపడుతున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థకుంటు పడడానికి ప్రధాన కారణం ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉదాసీనతేనని పలువురు విమర్శిస్తున్నారు. ఉదాహరణకు మండల కేంద్రమైన రొంపి చర్ల ఆర్టీసీ నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారడంతో వ్యాపారస్తులకు అడ్డాగా మారింది. పల్నాడు జిల్లా ప్రధాన కేంద్రం ఆర్టీసీ డివిజన్ కేంద్రమైన నరస రావుపేట నుండి రోజూ ప్రభుత్వ, ప్రయివేటు విధానంలో 91సర్వీసులు, అదనంగా మరో 16 సర్వీసులు నడుస్తు న్నాయి. అయితే రొంపిచర్ల మండలంలో బస్సులు నడపా లంటే నష్టాలు ఎదురవుతున్నాయనీ, ఆక్యుపెన్సీ వల్ల రెవిన్యూ తగ్గటంతో బస్సు సర్వీసులు తగ్గించినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే విషయమై నరసరావుపేట ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రొంపిచర్ల మండలం పరిధిలో ప్రస్తుతం రోజుకు మూడు దఫాలుగా బస్సులు నడుపుతున్నా మన్నారు. దీని వల్ల నెలకు రూ. లక్షల్లో సంస్థకు నష్టం వాటిల్లు తోందని తెలి పారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణం అన్యాక్రాంతానికి గురైన విషయం తమ దృష్టికి వచ్చిందనీ, ఇదే విషయమై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని డిపో మేనేజనర్ తెలిపారు.

స్మార్టు బిగించి పేదలను ఇబ్బందులకు గురి చేయొద్దు

స్మార్టు మీటర్ల గురించి అవగాహన కల్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అదాని స్మార్ట్ మీటర్లను బిగించవద్దు నిరుపేద పేదలను ఇబ్బందులకు గురి చేయవద్దు అంటూ విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక చిలకలూరిపేట కన్వీనర్ పేరు బోయిన వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కొమురవల్లిపాడు (పాటి మీద)లో ఇంటింటికి తిరుగుతూ స్మార్ట్ మీటర్ల వలన కలిగే నష్టాలను వివరిస్తూ కరపత్రాలు పంచారు. పేదలకు ఈ స్మార్ట్ మీటర్ ఖరీదు రూ.10 నుంచి నుంచి కేటగిరిని బట్టి రూ. 17వేల వరకు నిర్ణయించి 93 నెలల్లో నెలవారీగా విద్యుత్ బిల్లులో వేసి వసూలు చేయబోతున్నారన్నారు. కొమురవెల్లిపాడులో కొన్ని ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించాలని బిగించబోయే ముందు మాకు వద్దని చెప్పిన మహిళలకు మేము విద్యుత్ శాఖ ఉద్యోగులమని మా మాట వినకుంటే మీ విద్యుత్తు కనెక్షన్ కట్ చేస్తామని చెప్పారని వారి దృష్టికి తీసుకు వచ్చారు. మీటర్లు మాకు బిగించవద్దు అని అర్జీ ద్వారా అధికారులకు తెలియజేస్తే తొలగిస్తారని ఆయన వారికి సమాధానం చెప్పారు. ఈ స్మార్ట్ మీటర్ల వలన కలిగే నష్టాలు, ఇతర విషయాల గురించి ఆగస్టు 3వ తేదీన స్థానిక పండరీపురం రెండవలైన్‌లోని ఏలూరు సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల సమావేశం ఉంటుందన్నారు. ఆగస్టు 5వ తారీఖున విద్యుత్తు కేంద్రాల వద్ద సచివాలయాల వద్ద నిరసన చేపడతామని కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ నియో జకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ, బాబు, నర్సిరెడ్డి, వికెసి నియోజకవర్గ అధ్యక్షులు వంజాముత్తయ్య, ప్రజా సంకల్ప వేదిక ఎగ్జిక్యూటివ్ మెంబర్ బిరుదు లక్ష్మణ్, బీసీ సంఘాల నాయకులు వి.శ్రీనివాసరావు, టి.ప్రతాపరెడ్డి, ఫైరోజ్, సాతులూరి లూథర్ పాల్గొన్నారు.

ముస్లిములపై విద్వేషాన్ని ప్రేరేపించేలా హరిహర వీరమల్లు చిత్రం

రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్ బాషా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ముస్లింలపై విద్వేషం, ఉన్మాదాన్ని ప్రేరేపించేలా హరిహర వీరమల్లు చిత్రంలో అత్యంత బాధ్యత కలిగిన పదవిలో ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించడంపై ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి రెడ్‌బాషా విమర్శించారు. ఆదివారం నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో హరిహర వీరమల్లు సినిమాలో చూపించిన అభ్యంతరకర సన్నివేశాలపై వామపక్షాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. రెడ్‌బాషా మాట్లాడుతూ చిత్రంలో హిందు,ముస్లింలను రెచ్చగొట్టే సన్నివేశాలు ఉన్నాయన్నారు. వక్తలు మాట్లాడుతూ హరిహర వీరమల్లు కాలంలో ఔరంగజేబు లేడనీ, అలాంటప్పుడు ఔరంగజేబు, వీరమల్లు యుద్ధం ఎట్లా చేశారని ప్రశ్నించారు. చేగువేరా వారసుడిని చెప్పుకుంటూ ఆర్ఎస్ఎస్ ఎజెండాతో బిజెపి పాలకులను మెప్పించి పదవులు పొందటానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. కుల, మతాలకతీతంగా అభిమానులను సంపాదించుకున్న పవన్‌కళ్యాణ్ ఆర్ఎస్ఎస్ ఎజెండా విడనాడాలని హితువు పలికారు. ఆవాజ్ జిల్లా గౌరవ అధ్యక్షులు రబ్బాని, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, నరసరావుపేట పట్టణ, మండల సిపిఎం కార్యదర్శులు షేక్. సిలార్‌మసూద్, డి.శివకుమారి, ఎంఐఎం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు కరిముల్లా, కాంగ్రెస్ నాయకులు షేక్ మహబూబ్ బాషా, కృష్ణఫ్యాన్స్ టౌన్ ప్రెసిడెంట్ ఎండి. ఫరూక్ బాబు, సమైక్యాంధ్ర ముస్లిం జేఏసినాయకులుషేక్‌జిలానీమాలిక్,షేక్‌సలాం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 5న ధర్నా

ప్రజాశక్తి - యడ్లపాడు

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ఆగస్టు 5వ తేదీన ధర్నా చేపడుతున్నట్లు కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ పిలుపు నిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ అదానీ ప్రయోజనాల కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒత్తిడితో రాష్ట్రంలో ప్రజలపై వేస్తున్న భారాలను అందరూ వ్యతిరేకించాలన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే విద్యుత్ బిల్లులు పెరుగుతాయని, ఒక్కో మీటరుకు అయ్యే రూ.10-17 వేలను 93 నెలల్లో విడతల వారీగా వినియోగదారుల నుండే వసూలు చేస్తారని చెప్పారు. స్మార్ట్ మీటర్లను ఎన్నికలకు ముందు కూటమి వ్యతిరేకించిందని, వాటిని పగల గొట్టాలని లోకేష్ చెప్పారని గుర్తు చేశారు. అధికారం లోకి వచ్చాక అదే స్మార్ట్‌మీటర్లను ప్రజలపై రుద్దదానికి పూనుకున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో జరిగే ఆందోళనల్లో రాజకీయ పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. ఇదిలా ఉండగా స్మార్ట్ మీటర్లు వద్దని, పాత మీటర్లనే కొనసాగించాలని సమావేశంలో పాల్గొన్న పలువురు వినియోగదారులు కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు జి.హరిబాబు, కె.రమ్య, బి.పీటర్, ఎన్.తులశయ్య, కె.రామారావు, సిహెచ్.గురుస్వామి పాల్గొన్నారు.

కొత్తగా 72 పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - రెంటచింతల

ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి వేదన అనుభవిస్తున్న వితంతువులకు కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. కొంతకాలంగా వీరిని ఊరిస్తున్న భాగస్వామి (స్పాంజ్) పింఛను ఆగస్టు ఒకటో తేదీన పంపిణీ చేయనున్నారు ఎన్టీఆర్ భరోసా పథకం కింద రెంటచింతల మండలానికి నూతనంగా 72 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస తెలిపారు. వీరికి ప్రతినెల రూ.4000లు చొప్పున ఇస్తామన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా దుగ్గిరాల రైల్వే స్టేషన్

ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా క్రొత్త రైల్వే స్టేషన్, మూడో లైన్ నిర్మాణానికి అడ్డంగా ఉన్న పాత రైల్వే స్టేషన్, రైల్వే స్టేషన్‌పై చిత్రీకరించిన స్థానిక వనరులు పసుపు పంట

ఆధునిక హంగులతో రూపొందిన స్టేషన్
మంగళవారం ప్రారంభించనున్న అధికారులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

విజయవాడ నుండి గూడూరు మధ్య మూడవ రైల్వే లైను నిర్మాణంలో భాగంగా దుగ్గిరాలలో నిర్మించిన క్రొత్త రైల్వే స్టేషన్ ను మంగళవారం ప్రారంభించ నున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో 137 సంవత్సరాల క్రితం (1888)లో నిర్మించిన పాత రైల్వే స్టేషన్ మూడో లైను మార్గంలోని మెయిన్ లైన్ కు అడ్డంకిగా ఉండటంతో రైల్వే లైను నిర్మాణం ఆగిపోయినది. క్రొత్త స్టేషన్ లోనికి మారిన తర్వాత పాత రైల్వే స్టేషన్ ను పగల గొట్టి రైల్వే లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రతి నిత్యం దాదాపు 84 రైళ్లు బళ్ళు ఈ మార్గంలో ప్రయాణిస్తాయి. దక్షిణ భారతదేశం నుండి తూర్పు ఉత్తర ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న ఈ మార్గం ప్రయాణానికే గాక వాణిజ్యానికి కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్రతిరోజు వందల సంఖ్యలో గూడ్స్ బళ్ళు నడుస్తాయి. దీనితో రద్దీ తట్టుకునేందుకు 20 15 -16 సంవత్సరాలలో దాదాపు 322 కిలోమీటర్ల మేర మూడో లైన్ నిర్మాణం చేపట్టారు. కొత్త రైల్వే స్టేషన్‌ను ఆధునిక హంగులతో నిర్మించారు. సిగ్నల్స్ సాటిలైట్ కంప్యూటర్స్‌తో పాటు సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాన్ని అందించే నిమిత్తం ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం ప్రాముఖ్యతను వివరిస్తూ స్టేషన్ పై పసుపు పంట మరియు డెల్టా ప్రధాన కేంద్రమైన స్థానిక పాతలాకుల వద్ద కాలువలు చిత్రీకరించారు. ప్రయాణికులకు చూపురులకు ఈ ప్రాంతం ప్రత్యేకతలు ఇట్టే అర్ధమవుతాయి. స్టేషన్ కు ఉత్తరం దక్షిణం వైపు అధునాతన పద్ధతిలో క్యాబిన్లు నిర్మించారు. ప్రయాణికుల సౌకర్యార్థం కూడా మరుగుదొడ్డు నిర్మించారు.

రైల్వే లైన్ నిర్మాణం చేపట్టిన ఆర్‌విఎన్‌ఎల్

సమస్త స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి రైల్వే శాఖకు అప్పగిస్తుంది. కానీ రైల్వే లైన్‌ను పూర్తి చేసి ప్రభుత్వానికి అందించటానికి ఇంకా రెండు నెలలు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. మార్గంలోని తెనాలి - విజయవాడ మధ్య నిర్మాణం పూర్తి చేసిన అనంతరం ట్రైల్ రన్ నిర్వహించిన అనంతరం రైల్వే శాఖకు అప్పగించనున్నారు. దుగ్గిరాల గ్రామ ప్రజలకు కాక పరిసర గ్రామ ప్రజలకు సేవలు అందించనున్న ఈ రైల్వే స్టేషన్ ఆధునిక హంగులతో ప్రయాణికులకు మరిన్ని సేవలు అందించనున్నది.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

236వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 23వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో షేక్ ఇమాంబీ, బత్తుల భూలక్ష్మి, బి.నవనీతం, డి.అంకయ్య, అల్లం విజయశ్రీ కూర్చున్నారు. దీక్షలను కార్మిక నాయకుడు కూరపాటి. స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహించడం సరికాదు అన్నారు. యాజమాన్యం నుండి తమకు రావలసిన బకాయిలు ఇప్పించడానికి ముఖ్యమంత్రి స్థాయిలో కృషి కొనసాగించాలని కోరారు. ఈకార్యక్రమంలో బి.సూర్యప్రకాశరావు, తుపాకుల నాగేశ్వరావు, షేక్ సుభాని, ఆరిఫ్, బాషా, షేక్ ఇస్మాయిల్, కె.హగ్గయ్య, బి.దానయ్య, ఖాసీం, ఎం.గురవయ్య, వి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కలాంకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

అబ్దుల్ కలాంకు నివాళి

ప్రజాశక్తి - తాడేపల్లి

భారత 'మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి స్థానిక టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు అద్దంకి మురళి మాట్లాడుతూ విజ్ఞానానికి ప్రతీకగా, విద్యార్థులు, యువతకు మార్గదర్శకునిగా నిలిచిన కలాం తన జీవితం మొత్తాన్ని దేశసేవకు అంకితం చేశారని కొనియాడారు. టీడీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఇట్టా భాస్కర్ మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం నిరుపేద తమిళ్ ముస్లిం కుటుంబంలో జన్మించి శాస్త్రవేత్తగా భారత రాష్ట్రపతిగా దేశానికి విశిష్టమైన సేవలు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు చాంద్ భాషా, నియోజకవర్గం మైనార్టీ సెల్ కార్యదర్శి నాగుల మీరా, తాడేపల్లి పట్టణ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ సైదా హుస్సేన్, తాడిబోయిన భాస్కర్, ఇలియాస్, సైదా, నాగూర్ వలి, ఇస్మాయిల్, తాడిబోయిన గోపి, పి.భాస్కరరావు, శ్రీనివాసరావు, కరీముల్లా, హితేష్, తదితరులు పాల్గొన్నారు.

రన్నింగ్ పోటీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రత్యేక అనుమతి పొందిన మహిళా అభ్యర్థులకు పరీక్షలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని క్రీడామైదానంలో గతంలో జరిగిన కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షలకు రాలేకపోయిన వారిలో ప్రత్యేక అనుమతి పొందిన వారికి ఆదివారం 205 మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ పర్యవేక్షణలో అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 367 మంది హాజరు కావాల్సి ఉండగా 205 మంది హాజరవగా, 162 మంది గైర్హాజరయ్యారు. 205 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 189 మంది బరువు, ఎత్తు, ఇతర పరీక్షలలో అర్హత సాధించారు. 16 మంది అనర్హత సాధించారు. అర్హత కలిగిన వారిలో 189 మందికి 1600 మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల పరుగుపందెం లాంగ్ జంప్ నిర్వహించారు. మొత్తం 205 మంది మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 33 మంది అర్హత సాధించగా, 172 మంది అనర్హత సాధించారని అధికారులు తెలిపారు. కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ప్రతి ఘట్టంలో స్వయంగా పరిశీలించి, పరీక్షల నిర్వహణ అధికారులకు అభ్యర్థులకు ఎస్పి సూచనలు చేశారు. ఎస్పితో పాటు అదనపు ఎస్పిలు రవికుమార్, హనుమంతు, డిఎస్పిలు బానోదయ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి రాష్ట్ర అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి - తాడేపల్లి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్‌ని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందర్రావు యాదవ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. రాష్ట్ర బీసీ సెల్ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దానబోయిన సుందరరావు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర టిడిపి అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్గాల నాయకులను ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారని కొనియాడా రు. పల్లా శ్రీనివాసరావును కలిసిన వారిలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, టిఎన్ఎస్ఎఫ్ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు కంభం సాయి చంద్, రాష్ట్ర బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు కె.గురునాథం, తాడిబోయిన గోపి, షేక్ నాగూర్, ఎల్.శ్రీనివాస్ గౌడ్, సిహెచ్. చిన్ననాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

సమాజ హితమే మద్దినేని సుధాకర్ లక్ష్యం

ప్రజాశక్తి - గుంటూరు

సమాజ హితమే లక్ష్యంగా చేసుకొని ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా తనదైన చెరగని ముద్ర వేసిన మద్దినేని సుధాకర్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారిగా నియమితులవ్వడం ఎంతో అభినందనీయమని డాక్టర్ యర్రా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక భాష్యం మెయిన్ క్యాంపస్‌లో డాక్టర్ మద్దినేని సుధాకర్‌కు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సుధాకర్ తాను రక్తదానం చేయడమే కాకుండా ఎంతోమందికి రక్తదాన ఆవశ్యకతను తెలియజేసి, ప్రాణదాతగా నిలిచారన్నారు. భాష్యం ఛైర్మన్ రామకఅష్ణ మాట్లాడుతూ ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాలలో 30 ఏళ్లుగా గణిత అధ్యాపకునిగా సేవలందించడంతో పాటు 23 సంవత్సరాలుగా కళాశాల ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారిగా విధులు నిర్వర్తించడం సాధారణ విషయం కాదన్నారు. వఅత్తి పట్ల అంకితభావం, నిబద్ధత ఉన్నవారికే ఇది సాధ్యపడు తుందన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల తెలంగాణ పి.ఆర్.ఒ. గొర్నేని రవికుమార్ మాట్లాడుతూ రక్తదాన అవశ్యకతను అందరికీ తెలియజేస్తూ వందసార్లు రక్తదానం చేసిన మద్దినేని కఅషికి రాష్ట్రపతి నుండి అవార్డు అందుకోవడంతో పాటు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకోవడం అభినందనీయం అన్నారు. అనంతరం సుధాకర్ దంపతులను ఆయన మిత్ర బృందం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరేంద్ర చౌదరి, గంటా పున్నారావు, జమ్ముల శ్యామ్ కిషోర్, కోయ సుబ్బారావు, ఇ.దుర్గాప్రసాద్, మలినేని పెరుమాళ్ళు, సరిపూడి అనిల్ కుమార్, రాయపాటి అమఅత్, రాయల్ సుబ్బారావు, శ్రేయోభిలాషులు ఎన్.వి.రత్తయ్య, వికాస్ శంకర్రావు, సుఖదేవ్ తదితరులు పాల్గన్నారు.



మద్దినేని సుధాకర్ దంపతుల్ని సత్కరిస్తున్న మిత్రబృందం

నివాళి అర్పిస్తున్న మేయర్, టిడిపి నాయకులు

యువతకు స్ఫూర్తి ప్రదాత కలాం

ప్రజాశక్తి- గుంటూరు

భారతరత్న ఎపిజె అబ్దుల్ కలాం నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత అని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఆదివారం అబ్దుల్ కాలం వర్ధంతి సందర్భంగా స్థానిక జ్యూట్ మిల్లు మసీదు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి టిడిపి నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం భారత రక్షణ, అంతరిక్ష పరిశోధన రంగాలకు అందించిన సేవలకుగాను 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ప్రసిద్ధి చెందారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, టిడిపి నాయకులు హనుమంత రావు, శ్రీకాంత్, విజయకాంత్, నజీర్, లాల్ వజీం పాల్గొన్నారు.

భయం వీడితే గణితంపై పట్టు

ప్రముఖ గణిత అధ్యాపకులు డాక్టర్ ఎస్.లెనిన్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులలో గణితం పట్ల నెలకొన్న భయాన్ని వీడి దృష్టి సారిస్తే పట్టు సాధించవచ్చునని ప్రముఖ గణిత అధ్యాపకులు డాక్టర్ ఎస్.లెనిన్ బాబు విద్యార్థులకు సూచించారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నరస రావు పేట పట్టణంలోని టైనిటాట్స్, కిండర్ జాయ్ స్కూల్‌లో నకరికల్లు మండలం కడ్లగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితశాస్త్ర అధ్యాపకులు చాంద్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన గణిత శాస్త్ర ప్రత్యేక అవగాహన సదస్సులో డాక్టర్ ఎస్.లెనిన్‌బాబు విద్యార్థులకు బీజగణితం, నెంబర్ థియరీ, త్రికోణమితి, కలనగణితంలోని అంశాలను సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. పోటీ పరీక్షలకు గణితంలోని అంశాలు, గణిత శాస్త్ర సమస్యలను వివరించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ సులభ శైలిలో గణితం బోధించిన డాక్టర్లు లెనిన్ బాబును పల్నాడు బాలోత్సవం కమిటీ అధ్యక్షులు షేక్‌మస్తాన్ షరీఫ్ అభినందించారు. సదస్సులోని అంశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని గణితంపై మరింత పట్టు సాధించా లన్నారు. పల్నాడు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, కోశాధికారి కోయ రామారావు, పల్నాడు బాలోత్సవం కమిటీ సభ్యులు ఏ. భాగేశ్వరి దేవి, షేక్ చాంద్ బాబు, మద్దుకూరి మోహన్, విజ్ఞాన కేంద్రం వర్కింగ్ కమిటీ కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, నరస రావుపేట, నకరికల్లు, రొంపిచర్ల మండలాలలోని 30కి పైగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

గణితంలో సందేహాలను నివృత్తి చేస్తున్న డాక్టర్ లెనిన్ బాబు

అధికారుల నిర్లక్ష్యం - పేరుకుపోయిన వ్యర్థాలు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో పాలకులు, పురపాలక సంఘం అధికారులు నిర్లక్ష్య వైఖరితో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. గుడ్ మార్నింగ్-నరసరావుపేట కార్యక్రమంపేరిట వైసిపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం పట్టణం లోని పలుప్రాంతాలను పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కొన్ని ప్రాంతాలలో నివాస గృహాల మధ్య రోజుల తరబడి చెత్త నిల్వలు పేరుకుపోయిన నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పట్టణంలో పలు వీధులలో చెత్త కుప్పలు పేరుకు పోయి దుర్వాసన కొడుతోందని అన్నారు. కలుషిత వాతావరణంతో చిన్న పిల్లలకు జ్వరాలు వస్తున్నాయని స్థాని కులు చెబుతున్నారన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్య క్రమాలు ప్రచార ఆర్భాటం కోసమే కానీ ఆశించిన మేర ఫలితాలు ఇవ్వడం లేదన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య పనులలో భాగంగా పనులు చేపట్టిన నరసరావు పేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రస్తుతం పారిశుధ్యాన్ని గాలి కొదిలేశారని ఆరోపించారు.

రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

ప్రజల్లోకి రావాలంటే ఆంక్షలా?

ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని చెప్పేందుకు గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం పేరిట ప్రజల్లోకి వెళుతుంటే బయటకు రావడానికి అనుమతి లేదంటూ 1వ పట్టణ నోటీసులు జారీ చేయడాన్ని విమర్శించారు. రెండు పర్యాయాలు నరసరావుపేట ఎమ్మెల్యేగా పని చేసిన నేను ప్రజల్లోకి రావాలంటే ఆంక్షలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపినాయకులు, గోపిరెడ్డి, అభిమానులు ఉన్నారు.

రాజకీయ అభివృద్ధిలో వడ్డెరలను భాగస్వామ్యం చేయండి

మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు బేబీరాణి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్ వడియరాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్తెనపల్లిలో రాష్ట్ర యువజన అధ్యక్షుడు ప్రమాణ స్వీకారోత్సవంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు బేబీరాణి పాల్గొన్నారు. రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడిగా తన్నీరు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకార మహోత్సవం సత్తెనపల్లి పట్టణంలోని సాయిబాబా మందిరం వద్ద ఏఐఎం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ 70 యేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా మనీ, ఏ ప్రభుత్వం వచ్చినా మమ్మల్ని రాజకీయంగా వాడు కుంటున్నారు తప్ప న్యాయం జరగడం లేదని అన్నారు. రాష్ట్రంలో తాము 40లక్షల మంది జనాభా ఉన్నామనీ, 2014లో చంద్ర బాబు ఇచ్చిన హామీని నిలబెట్టు కొని రాజకీయ అభివృద్ధిలో భాగ స్వామ్యల్ని చేయాలని కోరారు. రాజ కీయంగా వడ్డెర జాతికి ప్రాధాన్యత ఇవ్వాలనీ, ఒక రాజ్యసభ సీటు, మూడు ఎమ్మెల్సీలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీని నెరవేర్చి ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యువజన అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో నూతన కమిటీలు ఏర్పాటు చేసి ఎస్టీ సాధన సమితి కోసం ఉద్యమం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవల వేలాద్రి రాష్ట్ర కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు రాష్ట్ర కార్యదర్శి ఉప్పు తల దేవరాజ్ , రాష్ట్ర యువజన కన్వీనర్ దేరంగుల అంజి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాతర్ల మంజునాథ్, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు వేముల శ్రీదేవి, సత్తెన పల్లి నియోజకవర్గ అధ్యక్షులు మన్నెం వెంకట్ పాల్గొన్నారు.

రచయిత కరిముల్లాను సన్మానిస్తున్న అతిథులు

'ఎదురు మతం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

వినుకొండ పట్టణానికి చెందిన కరీముల్లా రాసిన ఎదురు మతం పుస్తకం పట్టణంలోని ఎన్జీవో భవనంలోని పెన్షనర్స్ హాల్లో ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ పుస్తకాన్ని అభ్యుదయభావాలతో, మానవతా దృక్పథంతో, సర్వజనులు సమానమనే పద్ధతిలో కవిత్వం సాగిందన్నారు. ఆయన రాసిన కవిత్వం ఒరియా, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో తర్జుమా చేశారని కొనియా డారు. వీరు రాసినవి ఆంధ్ర యూనివర్సిటీ వారు ఎంఏ తెలుగులో పాఠ్యాంశంగా చేర్చారని చెప్పారు. మున్సిపల్ ఛైర్మన్ మదర్ సాహెబ్, రిటైర్డ్ డిప్యూటీ డివో గాదెరామకృష్ణ, డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు, పల్నాడు కాలేజీ ప్రిన్సిపల్ నాగూర్ వలి, కేళం ఆదినారాయణ, పాషావలి, డాక్టర్ గోలిదాక్షాయిని పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ చేస్తున్న తోరటి అమరలింగేశ్వరరావు

పాడిరైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోరి సంగం డైరీ ఒకటవ పాల కేంద్రంలో 55మంది పాడి రైతులకు బోనస్ పంపిణీ చేసినట్లు ఒకటవ పాలకేంద్రం అధ్యక్షుడు తోరటి అమరలింగేశ్వరరావు తెలిపారు. పాడిరైతులకు లీటర్‌కు రూ.6ల చొప్పున 2లక్షల 40వేల బోనస్ పంపిణీ చేశామన్నారు. ఆయన మాట్లాడుతూ సంగం డైరీలో పాలు పోయడం ద్వారా పాడిరైతులకు బోనస్ పంపిణీతో ఆర్థికంగా చేయూతనిచ్చినట్లు అవుతుందన్నారు. సంగం డైరీ నర్సారావుపేట మేనేజర్ కాటం నరేంద్ర,సూపర్ వైజర్ అశోక్ చక్రవర్తి, పాలకేంద్రం సెక్రటరీ అన్నపురెడ్డి జీవన్ రెడ్డి,గ్రామ సర్పంచ్ పీలా గాయత్రీ లక్ష్మణ్,ఉప సర్పంచ్ అన్నపురెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

పులిచింతల
ఖాళీ స్థలాలకు రిజిస్ట్రేషన్ ఎప్పుడో..?

ప్రజాశక్తి - బెల్లంకొండ

పులిచింతల ముంపు గ్రామాలకు సంబంధించి బెల్లంకొండ, రాజుపాలెం, రెడ్డిగూడెం, అచ్చంపేట కొండమోడు, అయ్యప్ప నగర్, దాచేపల్లి పరిధిలో మాచవరం పరిధిలో పలు ప్రాంతాల్లో పులిచింతల ఆర్అండ్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో ఉచితంగా రిజిస్ట్రేషన్ కొంత మందికే చేశారు. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న స్థలాలకు, మిగిలిపోయిన ఇళ్లకు రిజిస్ట్రేషన్ ఎప్పుడు చేస్తారని పులిచింతల ముంపు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆర్అండ్ఆర్ సెంటర్లను అభివృద్ధి చేస్తామని, ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామనే హామీలను విస్మరించారని వాపోతున్నారు. సొంత ఇళ్లు, స్థలాల విష యంలో బ్యాంకుల ద్వారా రుణాలు కూడా ఇప్పించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాలని పులిచింతల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పుల్లారావు

సొసైటీ అధ్యక్షునిగా హరిబాబు

ప్రజాశక్తి - నాదెండ్ల

నాదెండ్ల సొసైటీ (పిఎసిఎస్) అధ్యక్షునిగా నల్లమోతు హరిబాబు ప్రమాణస్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు విచ్చేశారు. మార్క్‌ఫెడ్ జోనల్ మేనేజర్ దగ్గుమల్లి హరగోపాల్, చిలకలూరిపేట మార్కెట్ యార్డు ఛైర్మన్ షేక్ కరిముల్లా, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, నాదెండ్ల మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, ఎడ్లపాడు, చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సాయిబాబా, మదన్‌మోహన్, పల్నాడు జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు వీరారెడ్డి, నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్పీల మృతి బాధాకరం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు డీఎస్పీలు మృతి చెందటం, అడిషనల్ ఎస్పీ, డ్రైవర్‌కి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉండటం విచారకరమని లోక్ సత్తా పార్టీ నాయకులు మాదాసు భాను ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. రోడ్డు ప్రమాదం ఎవరికి, ఎప్పుడు, ఎలా సంభవిస్తుందో తెలియదని, అధికారులం కదా మాకేంటి అని అనుకోవడానికి వీలులేదని ప్రమాదం ఎటు నుంచి అయినా సంభవించవచ్చు అనేదానికి ఈ యాక్సిడెంటే నిదర్శనం అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఒక్క భారతదేశంలోనే 10శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనే విషయాన్ని గుర్తించాలని కోరారు. అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి ప్రమాదాలను నియంత్రించేందుకు రాష్ట్రస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీల సూచనలను పటిష్టంగా అమలు చేయ గలిగినప్పుడే రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం సాధ్య మవుతుందన్నారు. కొందరు డ్రైవర్లు అదనపు డ్యూటీలతో తగినంత విశ్రాంతి, నిద్ర లేకుండా వాహనాలను నడు పుతున్నారని, కొందరు మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్నారని, కొందరు అత్యుత్సాహంతో రాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, అంతేకాకుండా మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నా కఠినంగా నియంత్రించే పరిస్థితులు లేకపోవడం విచారకరమన్నారు.

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు నివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏ.పి. అబ్దుల్ కలామ్ వర్ధంతిని స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం స్టేషన్‌రోడ్‌లోని కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పుట్టి సాంబశివరావు అధ్యక్షత వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, సభ్యులు జెపిఎస్ శాస్త్రి మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష పరిజ్ఞానంలో నేటి మనదేశ ప్రగతికి వారు చేసిన కృషే పునాది అని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు. కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు దేవరశెట్టి రవి, సంస్థ గౌరవ అధ్యక్షులు కాశీ విశ్వనాథం సంస్థ సభ్యులు వేదాద్రి, సుబ్బారెడ్డి, రామకోటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ మాచర్ల ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 10వ వర్ధంతిని స్థానిక స్వామి వివేకానంద సేవాశ్రమంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్మన్ షేక్ మదర్‌సాహెబ్ హాజరై సేవాశ్రమం నిర్వాహకుడు గోవిందరెడ్డితో కలిసి అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మదర్‌సాహెబ్ మాట్లాడుతూ కలాం జీవితాన్ని, ఆయన సూక్తులను ఆదర్శంగా తీసుకొని నడవాలని పిలుపు నిచ్చారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రపతిగా, సైంటిస్ట్‌గా, మిస్సైల్‌మ్యాన్‌గా, మానవతావాదిగా ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. రిటైర్డ్ హెచ్ఎం చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, వెంకటరెడ్డి, యోగా టీంసభ్యులు సైదమ్మ, రాజేశ్వరి, రుక్మిణి, నాగలక్ష్మి, కళ్యాణి, సేవా శ్రమంలోని చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

తుదిమెరుగులు దిద్దుకుంటున్న వెయిటింగ్ హాలు, నూతనంగా ఏర్పాటు చేసిన బోర్డు, తహశీల్దారు కార్యాలయం

సుపరిపాలన.. సంస్కరణల దిశగా అడుగులు

ప్రజాశక్తి - తెనాలి

సుపరిపాలనకు ఆద్యులు... సంస్కరణల దిశగా అడుగులు... పరిపాలనే కాదు.. దానిలో తనదైన మార్క్ ఆయన సొంతం. సందర్శకులను ఏమాత్రం నొప్పించకుండా ఏడాది కాలంలో శాఖా పరంగా పలు మార్పులకు శ్రీకారం చుట్టిన ఆయన, ప్రభుత్వ కార్యాలయం, ఆ వాతావరణం ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండాలన్న తపనతో తలచిందే తడవుగా దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని, కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. తెనాలి తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ చేపట్టిన కార్యాలయ ఆధునీకరణ నేపథ్యాన్ని పరిశీలిస్తే..

పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు అధిక శాతం కొత్తపేటలోనే ఉన్నాయి. తహశీల్దార్ కార్యాలయంతో పాటు ఫైర్ స్టేషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, సబ్ ట్రెజరీ, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, సబ్ జైల్, కోర్టు, రూరల్ పోలీస్ స్టేషన్ అన్ని ఒకే ప్రాంతంలో ఉన్నాయి. ఇక తహశీల్దార్ కార్యాలయం విషయానికొస్తే 1882లో ఏర్పడింది. స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడిన ఈ కార్యాలయానికి ఎంతో చరిత్ర ఉంది. కార్యాలయం ఏర్పడిన నాటి నుంచి పరిశీలిస్తే ఎందరో అధికారులు ఈ ప్రాంతంలో పనిచేశారు. అయితే ఎవరికి వారు అధికార దర్పం ప్రదర్శించడమే కానీ, కార్యాలయం ఆధునీకరణకు చర్యలు చేపట్టలేదు. ఒకవేళ ఏదైనా చేపట్టినా వాస్తు, వగైరాలను దృష్టిలో ఉంచుకొని

నూతన హంగులతో ముస్తాబవుతున్న తహశీల్ధార్ కార్యాలయం

తహశీల్దార్ చాంబర్‌లో స్వల్ప మార్పులు మాత్రమే జరిగేవి. అంతకుమించి చెప్పుకోదగిన మార్పులకు ఆస్కారం లేదు. పైగా సందర్శకుల ఇబ్బందులను ఏ అధికారి పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో కార్యాలయానికి వచ్చే సందర్శకులు అధికారుల కోసం వేచి ఉండాల్సి వస్తే సమీపంలో ఉన్న షాపులు, చెట్ల కింద కాలక్షేపం చేయాల్సి వచ్చేది. కార్యాలయం ఆవరణలో సందర్శకులకు మూత్ర విసర్జనకు కూడా అవకాశం లేదు. ముఖ్యంగా వయోవృద్ధులు, వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వేచి ఉండాల్సి వస్తే వారి అవస్థ వర్ణనాతీతం. ఈ పరిస్థితులను అధ్యయనం చేసిన తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ పరిస్థితిలో మార్పు తేవాలని సంకల్పించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ఆశయాలకు అనుగుణంగా పాలనాపరమైన సంస్కరణలతో పాటు, కార్యాలయ ప్రాంగణంలో సందర్శకులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆశించారు. ఆ దిశగా దాతల సాయం కోరి ముందడుగు వేశారు. తహశీల్దార్ కార్యాలయానికి చుట్టూ ప్రహరీతో పాటు, ప్రాంగణంలో ఉద్యోగులు, పెన్షనర్స్ సమావేశాలకు ఓ మీటింగ్ హాలు, సందర్శకులు వేచి ఉండేందుకు వెయిటింగ్ హాలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తున్నారు. అన్నింటినీ మించి ఎదురుగా మూడు సింహాల రాజముద్ర మేజిస్ట్రేట్ హోదాను స్ఫురింప చేస్తుంది. ఇక తహశీల్దార్ కార్యాలయం ఎంట్రన్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్డ్ ప్రభుత్వ కార్యాలయానికి చిహ్నంగా సందర్శకుల దీష్టిని ఆకర్షిస్తోంది.

హోదా మాత్రమే కాదు.. మానవతా దృక్పథం ముఖ్యం

ప్రభుత్వ కార్యాలయం అంటే ప్రజా సమస్యలకు పరిష్కార వేదిక. ముఖ్యంగా రెవెన్యూ శాఖ అందులో ప్రధానమైనది.చనిత్యం ప్రజలతో మమేకమై ఉండాలి. మిగిలిన కార్యాలయాలతో పోల్చితే సందర్శకుల తాకిడి అధికం. సహజంగా రెవెన్యూ శాఖలో సమస్యలంటే.. ఏవో ఒకటి అరా మినహా అక్కడికక్కడ క్షణాల్లో పరిష్కారమయ్యేవి చాలా తక్కువనే చెప్పాలి. ఈ పరిస్థితుల్లో ఆయా పనులు పురస్కరించుకొని కార్యాలయానికి వచ్చేవారికి వేచి ఉండేందుకు కనీస సౌకర్యాలు అవసరం. హెూదా మాత్రమే కాకుండా మానవతా దఅక్పథం కూడా ఆలోచించడం అవసరం. వీటన్నింటితో పాటు వ్యక్తులకంటే వ్యవస్థ శాశ్వతం కాబట్టి ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కూడా మా బాధ్యత. అందుకే దాతల సాయంతో కార్యాలయాన్ని ఆధునీకరిస్తున్నాం.

- కెవి గోపాలకృష్ణ, తహశీల్దార్, తెనాలి.

శంకర కంటి ఆసుపత్రి సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - పెదకాకాని

పేద ప్రజలకు కంటి వైద్య సమస్యలు తలెత్తినప్పుడు గుర్తుకు వచ్చే ఒకే ఒక్క చిరునామా శంకర కంటి ఆసుపత్రి అని, సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సిఎంఓ సుధాకర్ పొట్టి అన్నారు. దశాబ్దాలుగా గ్రామీణ పట్టణ ప్రాంతాలలో వేలాది క్యాంపులు నిర్వహించి లక్షలాది మంది పేద ప్రజలకు ఉచితంగా కంటి చికిత్స చేసిన ఘనత ఒక్క శంకర కంటి ఆసుపత్రికి దక్కుతుందన్నారు. శంకర కంటి ఆసుపత్రి గ్రామాలలో క్యాంపులు నిర్వహించి ఏ ఖర్చు లేకుండా వారిని తమ సొంత వాహనాలలో తీసుకువచ్చి వారికి భోజనం, వైద్య సదుపాయాలు కల్పించి ఆపరేషన్ల అనంతరం తమ వాహనాలలోనే స్వస్థలాలకు పంపడం జరుగుతుంది అన్నారు. ఆగస్టు మూడో తేదీన పొన్నూరు రోటరీ సర్వీస్ వారి సహకారంతో చాణక్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించ నున్నామని కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు ఆ శిబిరంలో పాల్గొనాలని సూచించారు. అధునాతన పరికరాలతో ఉత్తమ వైద్యులతో నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించే ఏకైక ఆసుపత్రి ఒక్క శంకర కంటి ఆసుపత్రి మాత్రమే అన్నారు.

అన్న క్యాంటీన్ భవనానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

పేదల ఆకలి తీర్చడానికి మంత్రి నారా లోకేష్ సహకారంతో శాశ్వత అన్న క్యాంటీన్ భవన నిర్మాణం చేపట్టడం హర్షదాయకమని టిటిడి పాలక కమిటీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని రైలు పేటలో ఆదివారం 60 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న శాశ్వత అన్న క్యాంటీన్ భవనానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రారంభించిన ఈ క్యాంటీన్ ఎన్నికల అనంతరం మూసివేస్తారని ప్రచారం జరిగింది. కానీ క్రమం తప్పకుండా ఇప్పటివరకు కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం మంత్రి లోకేష్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు దాతలు అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. రైల్వే స్టేషన్ దగ్గరగా ఉండటంతో గ్రామంలోని పేదలతో పాటు ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారి ఆకలి ఈ అన్న క్యాంటీన్ తీరుస్తుంది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత, వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు, యార్డు చైర్మన్ ఉన్నం ఝాన్సీ, మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, సర్పంచ్ బాణావత్ ఖుషి బాయ్, గద్దె శ్రీనివాస్, పసుపులేటి సాయి చైతన్య, పసుపులేటి శ్రీనివాసరావు, పాటిబండ్ల కృష్ణ ప్రసాద్, బాణావత్ వెంకటేశ్వర నాయక్, తహశీల్దార్ ఐ.సునీత, పబ్లిక్ హెల్త్ ఈఈ సిహెచ్.సురేష్. డిఇ టి.సుబ్బారెడ్డి, గ్రామ కార్యదర్శి వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

బాజీబాబా దర్గా నిర్వహణ తీరుపై విమర్శలు

- దర్గా సిబ్బందిపై దాడులు
- మానసిక ఇబ్బందులతో వస్తున్న వారిని ప్రలోభాలకు గురిచేస్తున్న వైనం
- అధికారులు చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు

బాబా వారిని దర్శించు కుంటున్న భక్తులు, దర్గాకు వచ్చిన వారిని ప్రలోభాలకు గురి చేస్తున్న ముజావర్ కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని బాజీ బాబా దర్గా రాష్ట్ర వ్యాప్తంగానే కాక దేశవ్యాప్తంగా ఎంతో పేరు గడించింది. సుమారు ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన హజరత్ సయ్యద్ బాజీ షాహిది అవులియా బాబా వారి దర్గా అంటే దేశ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్ట కలిగి ఉంది. శ్రీకృష్ణదేవరాయలు సైతం బాబాను దర్శించారని చెబుతుంటారు. ఇటీవలే 537వ ఉరుసు మహోత్సవాన్ని పూర్తి చేసుకున్న దర్గా ప్రతిష్ట దెబ్బతినే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దశాబ్ద కాలానికి ముందు దర్గా ముతావలీల పరిధిలో ఉండేది అయితే వారిలో అంతర్గత విభేదాలు వల్ల వక్ఫ్ బోర్డ్ ఆధీనంలోకి వెళ్ళింది. కానీ ముజావర్ కుటుంబ సభ్యుల పెత్తనం ఇంకా దర్గాలో కొనసాగుతుంది. దర్గాలో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారని తెలిసి సదరు ముజావర్‌పై ఆంక్షలు విధించిన తిరిగి అలాంటి చర్యలకు పాల్పడటం పట్ల పలు అనుమానాలు నెలకొంటున్నాయి. ఇటీవలే ఒక ముజావర్ కుటుంబ సభ్యుడు దర్గాలో పనిచేస్తున్న సిబ్బందిపై దాడి చేయడం వారి ఆధిపత్యాన్ని తెలుపుతుంది. ప్రత్యేక ప్రార్థనల పేరుతో దర్గాకు వచ్చే మానసిక రోగులను సైతం వీరు ప్రలోభాలకు గురిచేస్తున్నారు. దీనిపై వక్ఫ్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి.



మందులు అందిస్తున్న తహశీల్దార్, సర్పంచ్ తదితరులు

మానవ సేవా సంస్థ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మానవ సేవా సంస్థ సేవలు అభినందనీయమని స్థానిక తహశీల్దార్ ఐ.సునీత అన్నారు. మండలంలోని పెద్ద కొండూరు గ్రామంలో ఆదివారం మానవ సేవ సంస్థ నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించమని తమ సహాయ సహకారాలు అందిస్తామని సమస్త వారిని కోరారు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేదరి సౌజన్య, సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్, డాక్టర్లు కమ్మెళ హరీష్, మిధునేశ్వరరెడ్డి, అర్చన, శ్రీకర్, వంశీకృష్ణ, శశిధర్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

అబ్దుల్ కలాంకు ఘన నివాళులు

ప్రజాశక్తి - మంగళగిరి

మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి స్థానిక టిడిపి కార్యాలయంఓ ఘనం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి స్థానిక టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ ఇబ్రహీం, మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాస రావు మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారధి, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చి రెడ్డి, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని, మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర, భైరబోయిన శ్రీనివాసరావు, జంజనం వెంకట సుబ్బారావు, చావలి ఉల్లయ్య, వంగర సదా శివరావు, షేక్ ఇమామ్‌సా, షేక్ బుడే, షేక్ జలీల్, జంజనం సాంబశివ రావు, కుర్నేళ్ల పూర్ణ చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫోరం కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న తిరుపాల్

కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

బైపాస్ లోని ఎన్ఎస్ఆర్ ప్లాజాలో నూతనంగా గుంటూరు జిల్లా కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కార్యాలయాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షులు కూడారి తిరుపాల్ హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం తిరుపాల్ మాట్లాడారు. సమాజంలో వినియోగదారుడు పడే ఇబ్బందులు, సమస్యలను తీర్చి, వారి హక్కులపై ఫోరం రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షులు బొమ్ము జస్వంత్‌రెడ్డి, జిల్లా యూత్ విభాగం అధ్యక్షులు టి రవికుమార్, ఫోరం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రియా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాస్కర్‌రాజు

తెలుగు భాష సంజీవని

ప్రజాశక్తి - గుంటూరు

విద్యార్థులకు తెలుగు భాష సంజీవని అని మేక్‌మై జీనియస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్.వి.భాస్కర్‌రాజు అన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసం దశలో తెలుగు భాష ఉచ్చరణ, చేతిరాతిపై పట్టు సాధించటం ద్వారా వారు మిగతా భాషలను సునాయాసంగా నేర్చుకోగలుగుతారని తెలిపారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞా కాన్వెంట్‌లో ప్రైమరీ తెలుగు ఉపాధ్యాయులకు నాలుగు దశల్లో తెలుగు దోషాలు లేకుండా చక్కటి ఉచ్చారణ, వ్యాకరణ దోషాలు లేకుండా రాయటంపై ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భాషా వ్యక్తిత్వాన్ని వికాస నిపుణులు డాక్టర్ ఎస్.వి.భాస్కర్‌రాజు మాట్లాడుతూ పిల్లల చేత తెలుగులో చదివించడం, రాయించటం ఒక వ్యాపకంగా మారడం ద్వారా తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదిస్తారన్నారు. తెలుగు భాష చేతిరాతిను మార్చే సంజీవని అన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గమనం మాట్లాడుతూ విద్యార్థుల్ని విజువల్ లెర్నర్స్‌గా మార్చేందుకు ఉపాధ్యాయులు నిరంతరం ప్రయత్నం చేయాలన్నారు. అధ్యక్షత వహించిన పాఠశాల కరస్పాండెంట్, కార్యదర్శి నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ నవకవులు గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి, శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కఅష్ణమూర్తి లాంటి ఉద్దండులు తెలుగు భాషకు వన్నెతెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో స్రైవీ అకాడమీ డైరెక్టర్ రవి, వెంకట్, ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలిస్తున్న కమిషనర్

సమ్మర్‌పేట చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు : కమిషనర్

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక సమ్మర్ పేట చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రధాన రోడ్ల వెంబడి, మేజర్ డ్రైన్లపైన ఆక్రమణలు తొలగించాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికాధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం శిల్పారామం చెరువు, జెకెసి కాలేజీ రోడ్, పట్టాభిపురం ప్రాంతాలను పరిశీలించి, అభివఅద్ధి పనులు, రోడ్ ఆక్రమణలు తొలగింపు, పారిశుధ్య పనులపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. సమ్మర్ పేట చెరువు శిల్పారామంకు అనుసంధానంగా ఉంటుందని, చెరువులో ప్రస్తుతం బండ్ ఏర్పాటు చేయడం జరిగిందని, సమగ్ర అభివఅద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిఈఈని ఆదేశించారు. అనంతరం పలు ప్రాంతాల్లో చికెన్, మటన్ షాప్స్‌ని తనిఖీ చేసి ప్లాస్టిక్ సంచుల వినియోగం నిషేధంలో భాగంగా ప్రజలు స్టీల్ బాక్స్ తెచ్చుకుంటే వారికి రాయితీ ఇవ్వాలని, ప్రతి స్టాల్‌లో కనిపించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యటనలో డిఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ ఐజాక్, కార్పొరేటర్ స్మిత పద్మజ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల సర్వే తొలి విడత పూర్తి

- మలి విడత మరో 11 గ్రామాల ఎంపిక
- ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
- గ్రామాల సరిహద్దుల నమోదుకు ప్రాధాన్యం
- 'ప్రజాశక్తి'తో జిల్లా సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పవన్ కుమార్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియ తొలి విడతగా 14 గ్రామాల్లో పూర్తి చేశామని జిల్లా సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.పవన్ కుమార్ తెలిపారు. రెండో దశలో 11 గ్రామాలను ఎంపిక చేశామన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించినట్టు తెలిపారు. అలాగే గ్రామాల సరిహద్దుల గుర్తింపును కూడా చేపట్టినట్టు ఆయన వివరించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు వెల్లడించారు.

జిల్లాలో మొత్తం ఎన్ని గ్రామాలు ఉన్నాయి. ఇప్పటి వరకు చేసిన సర్వే వివరాలు

జిల్లా మొత్తం 173 గ్రామాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 62 గ్రామాల్లో సర్వే పూర్తయింది. పలు గ్రామాల్లో సర్వేకు సంబంధించి హక్కుదారుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివాదాల పరిష్కారం దిశగా సర్వే చేయాలని నిర్ణయించారు. ఒకేసారి గ్రామం మొత్తం సర్వే చేయకుండా రోజుకు 20 ఎకరాల చొప్పున దాదాపు 160 రోజులు చేశాం. దీని వల్ల రైతులు నేరుగా వచ్చి తమ పత్రాలను అధికారులకు ఇచ్చి హక్కు పత్రాలను నిర్ధారించుకునే అవకాశం కల్పించాం. గత జనవరి 21 నుంచి రీ సర్వే ప్రారంభమైంది.

మొదటి దశలో సర్వే పూర్తయిన గ్రామాలు?

మొదటి దశలో 14 మండలాల్లో 14 గ్రామాలను ఎంపిక చేశాం. రోజుకు 20 ఎకరాల చొప్పున దాదాపు 5 నెలల పాటు సర్వే కొనసాగింది. మొదటి విడత సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో లచ్చనగుడిపూడి (తాడికొండ), మందపాడు (మేడికొండూరు), వడ్డమాను (తుళ్లూరు), జడవల్లి (పొన్నూరు), పెరికలపూడి (దుగ్గిరాల), మంచాల (చేబ్రోలు), కాంద్రుపాడు (కాకుమాను), మల్లాయపాలెం (ప్రత్తిపాడు), అనమర్లపూడి (పెదకాకాని), చినపలకలూరు (గుంటూరు పశ్చిమ), పెదరావూరు (తెనాలి), జన్నలగడ్డ (గుంటూరు తూర్పు), కుంచవరం (కొల్లిపర) గ్రామాలు ఉన్నాయి.

రెండో దశలో ఎంపిక చేసిన గ్రామాలు?

కొప్పురావూరు (పెదకాకాని), అంకిరెడ్డి పాలెం (గుంటూరు పశ్చిమ), బేతపూడి (ఫిరంగిపురం), హరిశ్చంద్రపురం (తుళ్లూరు), వంగీపురం (ప్రత్తిపాడు), రావెల (తాడికొండ), గొడవర్రు (చేబ్రోలు), దుగ్గిరాల (దుగ్గిరాల), కాకుమాను(కాకుమాను), సరిపురం, దంతలూరు (కొల్లిపర) గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 28,698.81 ఎకరాల భూములు ఉన్నాయి. ఈనెల 8వ నుంచి రెండో విడత రీ సర్వే ప్రారంభించినట్లు తెలిపారు.

గ్రామాల సరిహద్దులను ఎలా నిర్ణయిస్తున్నారు?

రెవెన్యూ గ్రామానికి ఉన్న సరిహద్దులను నిర్ధారించాలని ప్రభుత్వం నిర్ధేశించింది. ఆయా గ్రామాలకు గతంలో ఉన్న హద్దులు ప్రస్తుతం ఉన్నాయా? ఏమైనా మార్పు జరిగాయా అని పరిశీలన చేస్తున్నాం.సరిహద్దులలో ఉన్న ఆక్రమణలు ఏమైనా ఆక్రమణలు ఉన్నాయా అని పరిశీలించి నిర్ధారిస్తున్నాం.

ప్రభుత్వ భూములు గుర్తింపు ప్రక్రియ?

రైతులకు చెందిన పట్టాభూములు కాకుండా మిగతా భూములన్నీ ప్రభుత్వ భూములే. ప్రధానంగా పోరంబోకు, దేవాదాయ, నీటిపారుదల, చెరువులు, కుంటలకు సంబంధించిన

రెవెన్యూ భూముల గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. తద్వారా గ్రామాల్లో ఉన్న మొత్తం భూమి ఎంత? అందులో పట్టా భూమి? వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వం భూముల గుర్తించేందుకు సర్వే కొనసాగుతోంది.

సర్వేలో ఎవరు పాల్గొంటారు?

తహాశీల్దార్ పర్యవేక్షణలో గ్రామ సర్వేయర్లు గ్రామాన్ని సందర్శిస్తారు. 200 నుంచి 250 ఎకరాలను బ్లాకులుగా విభజించి ప్రతి గ్రామానికి నాలుగు బృందాలను ఏర్పాటు చేశాం. రెవెన్యూ శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యార్థి దశ నుంచే అంతర్జాతీయ అంశాలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - పెదకాకాని

విద్యార్థి దశ నుంచే అంతర్జాతీయ అంశాలు తెలుసుకోవాలని రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ముఖ్యకార్యదర్శి డాక్టర్ కె.శరత్ కుమార్, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మూడు రోజులుగా పెదకాకానిలో జరుగుతున్న అంతర్జాతీయ వ్యవహారాలపై అవగాహన, నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి చెందేలా వివా ది స్కూల్ విద్యార్థులు నిర్వహిస్తున్న మోడల్ యునైటెడ్ నేషన్ (ఐక్యరాజ్యసమితి నమూనా) ముగింపు సదస్సు ఆదివారం ఏర్పాటు చేశారు. సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ జాతీయ, అంతర్జాతీయ పాఠశాలల నుండి 450 మంది విద్యార్థులు పాల్గని ఐక్యరాజ్యసమితిలో భాగమైన ప్రతినిధుల సభ, భద్రత మండలి, సచివాలయం, అంతర్జాతీయ న్యాయస్థానం, ఆర్థిక సాంఘిక మండలి సభ్యులుగా ఏర్పడి ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ళు, మానవహక్కులు, భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన అంశాలపై చర్చించారు. చర్చలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.శరత్ కుమార్ మాట్లాడుతూ మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సు నిర్వహణ వలన భావితరాల వారికి ప్రపంచ దేశాలు ఎదుర్కుంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు తెలుస్తాయని తద్వారా

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న డాక్టర్ కె.శరత్ కుమార్, వాసిరెడ్డి విద్యాసాగర్

భావి నాయకులుగా, పరిణితి చెందిన పౌరులుగా ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులను అభినందించారు.వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థుల సమిష్టి కృషి ద్వారా అద్భుతాలు సృష్టించ గలుగుతారన్న విషయాన్ని ఈ కార్యక్రమం ద్వారా నిరూపించారని అన్నారు. యమ్.యూ.ఎన్ సంధాన కర్తలైన విద్యార్థి బృందాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎలె కమాండర్ కె.ఎస్. రావు, ప్రిన్సిపాల్ సిహెచ్. సరళ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

18న ఎన్‌టిఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికలు

ప్రజాశక్తి - గుంటూరు

ఎన్‌టిఆర్ మున్సిపల్ క్రీడాప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలు ఆగస్టు 18న నిర్వహిస్తున్నట్లు జిఎంసి డిప్యూటీ కమిషనర్, ఎన్నికల అధికారి డి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ సొసైటీకి గత కొన్ని సంవత్సరాలుగా పాలకవర్గ ఎన్నికలు నిర్వహించట్లేదన్నారు. రానున్న ఎన్నికల్లో 8 మంది సభ్యులను ఎన్నుకోవటం జరుగుతుందని, వారిలో వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్, నలుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులకు ఎన్నికలు ఉంటాయన్నారు. జులై 29న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందని, జులై 30 నుండి ఆగస్టు 1 వరకూ స్టేడియంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ నామినేషన్ల స్వీకరిస్తామని తెలిపారు. 2వ తేదీ ఉదయం 9 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ఎన్టీఆర్ స్టేడియంలో ప్రదర్శిస్తామని, 4న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల పరిశీలన, ఆగస్టు 5న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణ, తర్వాత తుది జాబితా ప్రకటన చేస్తామన్నారు. ఆగస్టు 18న ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, 2 గంటల తర్వాత కౌంటింగ్ చేపట్టి, ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. సొసైటీలో 2,126 మంది సభ్యులు ఉన్నారని, పాలకవర్గ ఎన్నికలలో పోటీ చేయదలచిన వారు ఎన్టీఆర్ స్టేడియంలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరు ఈ ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యవర్గ సభ్యుల ఎన్నికలను పారదర్శకంగా బ్యాలెట్ పేపర్ ఉపయోగించి సీక్రెట్ ఓటింగ్ ద్వారా నిర్వహిస్తామన్నారు.

మాట్లాడుతున్న బుచ్చిరాజు

పెన్షన్ వర్గీకరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - గుంటూరు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన పెన్షనర్ల వర్గీకరణ చట్టం పట్ల పెన్షన్‌దారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, తక్షణమే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.ఎం.బి.బుచ్చిరాజు కోరారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. బుచ్చిరాజు మాట్లాడుతూ కేంద్రం చేసిన చట్టం వల్ల పెన్షన్‌దారులను పదవీ విరమణ తేదీ, సంవత్సరం, ఇతర నియమాల ఆధారంగా వేర్వేరుగా చూపించటం వల్ల ఒకే విధమైన సేవ చేసిన వారు వేర్వేరు లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. సీనియర్ పెన్షనర్లు తక్కువ పెన్షన్, జూనియర్ పెన్షనర్లు ఎక్కువ పెన్షన్ పొందే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. సమాన పనికి సమాన పెన్షన్ నిబంధనలకు విఘాతమన్నారు. గతంలో వివాదాస్పదంగా తీసుకున్న వర్గీకరణలను ఇప్పుడు చట్టబద్ధంగా ముద్ర వేయటంతో న్యాయస్థానాలలోనూ కేసులు వేసిన పెన్షన్‌దారులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఈ చట్టం పెన్షన్‌ను హక్కుగా కాకుండా ప్రభుత్వాలపై ఆధారపడే విధంగా చేస్తుందన్నారు. కేంద్రం చేసిన చట్టాన్ని ఉపసంహరించు కోవాలని కోరారు. ముఖ్యంగా హెల్త్ కార్డులు పనిచేయట్లేదని, దీంతో పెన్షనర్లకు సకాలంలో వైద్యం అందట్లేదన్నారు. పటిష్టంగా అమలు చేయాలని, లేని ఎడల హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ షేక్ రియాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి యు.కూర్మారావు, కోశాధికారి బి.శివరామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, ఎం.వి.రంగాచారి, వి.వెంకటేశ్వరరావు, 13 జిల్లాల కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, రాష్ట్ర సంఘ నాయకులు పాల్గొన్నారు.